క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యురాలు హేమమానస ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 19 మంది గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించి నమూనాలను టీ హబ్ ద్వారా గద్వాలకు పంపించినట్లు తెలిపారు. అనంతరం పౌష్టికాహారం, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ కాన్పులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, అనసూయమ్మ, చిట్టెమ్మ, సంధ్య, ఆశ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతుభరోసా సంబురాలు

అలంపూర్: ఈ నెల 24న రైతుభరోసా సంబురాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ మండలంలోని క్యాతూర్, బుక్కాపురం, లింగనవాయి గ్రామాల్లోని రైతు వేదికల్లో సాయంత్రం 5 గంటలకు సంబరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విజయోత్సవ సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై సంబురాలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గట్టు: రైతు వేదికల వద్ద మంగళవారం నిర్వహించే రైతుభరోసా విజయోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి కోరారు. రైతులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



అయిజ: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ 73వ వర్ధంతి కార్యక్రమం సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. మహోన్నత దేశభక్తుడు, దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా సమర్పించిన మహనీయుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, రాజశేఖర్, మహేష్, వీరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి



మల్దకల్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, దాత శేషంపల్లి నర్సింహులు అన్నారు. సోమవారం మల్దకల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుకోవడం ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో విద్యుత్ స్తంభాన్ని బొలెరో వాహనం సోమవారం ఢీ కొట్టింది. ప్రమాదంలో వాహన ముందు భాగం ధ్వంసమైంది.

గాలివాన బీభత్సం



ధరూరు: మండల పరిధిలోని నెట్టెంపాడు గ్రామంలో గాలివాన బీభత్సం సృష్టించింది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో వీచిన ఈదురు గాలులకు ఆంజనేయ స్వామి ఆలయంలోని వేపచెట్టు కొమ్మ విరిగి పడింది. విద్యుత్ తీగలపై చెట్టు విరిగి పడటంతో గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం



జాంపపల్లి శివారులో పొలం సిద్ధం చేస్తున్న రైతు

- వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు
- పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు
- అందుబాటులో లేని సబ్సిడీ విత్తనాలు, ఎరువులు

ధరూరు: ఖరీఫ్ సాగు పనులు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ఖరీఫ్ మెట్ట పంట సాగుకు అనుకూలంగా మారాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి నెలరోజుల ముందుగానే మండలంలో వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులు దున్నుకుని పంటసాగుకు అనువుగా ఉన్న పొలాల్లో విత్తనాలు విత్తేందుకు సమాయత్తమవుతున్నారు.



ధరూరు శివారులో కలుపు తీత పనులు చేస్తున్న రైతులు

విత్తన పత్తికే మొగ్గు

నడిగడ్డ ప్రాంతంలో ఎక్కువగా సాగయ్యే విత్తన పత్తి పంట సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేకపోవడంతో ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మండలంలో ప్రధానంగా మెట్ట పంటగా ఆముదం, కంది, సజ్జ, జొన్న వంటి పంటలు సాగు చేస్తారు. రైతుల డిమాండ్ మేరకు విత్తనాలను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. ప్రధానంగా నవభారత్, గౌచ్- 4 వంటి రకాల ఆముదం విత్తనాలు అందుబాటులో ఉంచాలంటున్నారు.

39,000 ఎకరాల్లో సాగు

మండల పరిధిలో 39,000 ఎకరాల సాగు భూమిలో దాదాపుగా 22,000 ఎకరాల్లో వరి పంటకు సాగుకు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. సీడ్ పత్తికి 1000 ఎకరాలు, కమర్షియల్ పత్తి 300, కంది 50, సజ్జ 40 ఎకరాలు తదితర పంటల సాగుకు ముందస్తు పనులు చేపట్టినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

ముందస్తు చర్యలు శూన్యం

మండలంలో ఖరీఫ్ పంట సాగు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఏటా ఆలస్యంగా విత్తనాలు ఎరువులు సరఫరా చేస్తుండడంతో రైతులు గత్యంతరం లేక ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సాగుకు అనుకూలం

ప్రస్తుతం కరుస్తున్న వర్షాలు పంట సాగుకు అనుకూలంగా ఉన్నాయి. పత్తి విత్తనాలు నాటుకున్నాం. వరిపంట సాగుకు నారుమడులను సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి.
– చిన్న నర్సిరెడ్డి, జాంపల్లి

అందుబాటులో వరి విత్తనాలు

ప్రస్తుతానికి ఆర్ఎన్ఆర్, బీపీటీ సోనా మసూరి రకాలకు సంబంధించిన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అవసమైన రైతులు ఆగ్రోస్, పీఏసీఎస్ కార్యాలయాల్లో తీసుకోవచ్చు. విత్తనాలు, ఎరువులు అవసరమైన ప్రతి రైతుకు తప్పక అందేలా చూస్తాం.
– శ్రీలత, వ్యవసాయ అధికారి

మహాసభలను జయప్రదం చేయాలి



రాజోళిలో కరపత్రాలను విడుదల చేస్తున్న మైనార్టీ నాయకులు



అయిజలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అయిజ: జిల్లా కేంద్రంలో జూలై 13, 14న నిర్వహించనున్న ఆవాజ్ కమిటీ 3వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కమిటీ రాష్ట్ర నాయకుడు జబ్బార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వెంక్రటాములు, బీఆర్ఎస్వీ నాయకులు పల్లయ్య, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్‌చైర్మన్ తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

రాజోళి: ఆవాజ్ కమిటీ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆవాజ్ కమిటీ సభ్యులు కోరారు. మండల కేంద్రంలో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అతికూర్ రెహిమాన్, బీఆర్ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాముడు, రహ్మతుల్లా, పల్లయ్య, నిషాక్, ముక్తార్, బషీర్ తదిదరులు పాల్గొన్నారు.

బీచుపల్లిలో ప్రత్యేక అభిషేకాలు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. పంచామృత అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల పంపిణీ



భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

గట్టు: మండల పరిధిలోని బల్గెర గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక బింగిదొడ్డి కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. గురువు గుణాతీతుడన్నారు. సాక్షాత్తు శ్రీకృష్ణుడుని మాత్రమే జగద్గురువుగా భావించి పూజించాలన్నారు. జూలై 10న గురుపౌర్ణమిని పురస్కరించుకొని భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రంగప్ప, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, నర్సింహ, శివ తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి సొంతింటి కల సాకారం



చెన్నిపాడులో భూమిపూజ చేస్తున్న సతీష్‌రెడ్డి, మహ్మద్ సిరాజ్

మానవపాడు: ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడి సొంతింటి కల సాకారమవుతుందని రాష్ట్ర ట్రాన్స్‌ఫోర్ట్ అథారిటీ మెంబర్ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి మహ్మద్‌సిరాజ్ అన్నారు. సోమవారం చెన్నిపాడు, అమరవాయి, పెద్దఆముదాలపాడు, నారాయణపురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందన్నారు. రుణమాఫీ, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ల వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, అలంపూర్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గణేష్, పరమేష్‌నాయుడు, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

గట్టు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసుకోవాలని మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం చాగదోన గ్రామంలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. గ్రామంలో మొత్తం 31 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, వీరశేఖర్, మునిచంద్రగౌడ్, శివప్ప, తిరుమలగౌడ్, పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు అందజేత

మండల పరిధిలోని అంతంపల్లి గ్రామానికి చెందిన రైతు మల్దకల్ కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ రైతుబీమా చెక్కు అందజేశారు. గత నెలలో అనారోగ్యంతో మృతిచెందగా, రైతు బీమా ద్వారా రూ.5 లక్షల చెక్కు మంజూరైనట్లు తెలిపారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

కేటీదొడ్డి: పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు వెంకన్నగౌడ్ అన్నారు. మండల పరిధిలోని పాతపాలెం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాణిక్యం, వెంకట్‌రెడ్డి, పాండు, అజూం పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఇటిక్యాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రుక్మందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని శనగపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరేష్‌బాబు, నాయకులు అల్లాబకాష్, మహేష్, బోయ బీసన్న, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులకు భూమిపూజ

అయిజ: మండలంలోని కొత్తపల్లి, ఉత్తనూరు, తూంకుంట గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయన్న, కార్యదర్శులు భూమి పూజల చేశారు. అదే విధంగా మున్సిపాలిటీలోని 13, 16 వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు.



షేకుపల్లిలో భూమిపూజ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో

ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండేరు, వల్లూరు, ధర్మవరం, యాక్తాపురం, కొండపేట, షేకుపల్లి, జింకలపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలిశ్రీనివాసులు హౌసింగ్ ఏఈ ప్రియాంకతో కలిసి ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సోమనాద్రి, నర్సింహారెడ్డి, వెంకటేష్‌యాదవ్, ఆదాం, యువరాజు, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.



శనగపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రుక్మందర్‌రెడ్డి



పాతపాలెంలో భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



చాగదోనలో భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: అంబేడ్కర్ ఆశయాలు నేటి తరం కొనసాగించాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని పాల్వాయి గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, బందారి భాస్కర్, జంబు రామన్‌గౌడ్, సీతారాంరెడ్డి, జీవన్‌రెడ్డి, వెంకటన్న, రాజారెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక చర్యలు



రేవులపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: పదో తరగతి విద్యార్థులు తప్పనిసరిగా వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. సోమవారం రేవులపల్లి ఉన్నత పాఠశాల, ఎములోనిపల్లి పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యా సంవత్సర ఆరంభం నుంచే ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులందరూ ఐఎఫ్‌బీ బోర్డులు ఉపయోగించి పాఠాలు బోధించాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతతో పాటు రుచిగా అందించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి, మల్లప్ప, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

మానవపాడు: మండలంలోని బోరవెల్లి గ్రామం పాఠశాలను ఎంఈఓ శివప్రసాద్ పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కేటీదొడ్డి: విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని ఈర్లబండ, పాతపాలెం పాఠశాలల్లో ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం బడిబాటపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అలంపూర్: మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ట్రైనీ ఎస్ఐ నిమ్మలకుమార్, తరుణ్ అన్నారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న కమిటీ సభ్యులు

అలంపూర్: పట్టణంలోని వాసవీ నిత్యాన్న సత్రంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు కుమారుడికి హైదరాబాద్‌కు చెందిన కట్ట రామకృష్ణ ఆర్థిక సాయం అందించినట్లు వాసవీ నిత్యాన్న సత్రం అధ్యక్షుడు చిలుకూరు రమేష్ గుప్తా తెలిపారు. దాత తండ్రి కట్టా లక్ష్మీనర్సయ్య జ్ఞాపకార్థం స్థానిక గురుదేవ్ పాఠశాలలో 2వ తరగతి నుంచి 10 తరగతి వరకు చెల్లించనున్న ఫీజు యూనిఫాం, పుస్తకాలు, సామగ్రి అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఇల్లూరి వెంకట్రామయ్య శెట్టి, చిన్మయానందశెట్టి పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

గట్టు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ బుర్రి సతీష్‌మాదిగ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దిన వేడుకలు కులాలకు అతీతంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మందకృష్ణమాదిగ మొదలుపెట్టిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రభావం అన్ని అణగారిన కులాల్లో సామాజిక చైతన్యాన్ని రగిల్చిందన్నారు. ప్రతి కులం తమ అస్థిత్వాన్ని చాటుకోవడానికి సంఘాలను ఏర్పాటు చేసుకొని పోరాట బాటలోకి వచ్చినట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం కేవలం మాదిగల ప్రయోజనాల కోసమే పరిమితం కాకుండా అన్ని అణగారి కులాల సంక్షేమం కోసం కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షుడు జోగుళాం బగద్వాల జిల్లా కోఇన్‌చార్జ్ మీసాల గణేష్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ ఇమ్మానియేలు, ఎమ్మార్పీస్ కళా మండలి జిల్లా అధ్యక్షుడు హల్లి చరణ్‌మాదిగ, ముక్కెరన్న, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్ భాగంలో ముంపునకు గురైన ఉప్పేరు పునరావాస కేంద్రంలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉప్పేరు పునరావాస గ్రామస్తులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జీఓ 98 ప్రకారం ట్రాన్స్‌పోర్ట్ చార్జెస్ రూ. 3లక్షలు, ఇళ్ల బిల్లులు మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు.

29న సాయిచంద్ విగ్రహ ఆవిష్కరణ



అమరచింతలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న రజనీసాయిచంద్

అమరచింత/ఆత్మకూర్: అమరచింత పట్టణంలో ఏర్పాటు చేసిన సాయిచంద్ విగ్రహ ఆవిష్కరణకు ఈనెల 29న మాజీ మంత్రులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు వస్తున్నారని గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనిసాయిచంద్ తెలిపారు. ఈ మేరకు సాయిచంద్ విగ్రహ ఆవిష్కరణ, బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం అమరచింత, ఆత్మకూర్ పట్టణాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ సాయిచంద్ అమరచింతలో పుట్టి తన గానంతో యావత్తు తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాడని, దేశ, విదేశాల్లో పాలమూరు ప్రజల వాణి వినిపించిన వ్యక్తిగా చరిత్రలో మిగిలి పోయాడని గుర్తు చేసుకున్నారు. విగ్రహ ఆవిష్కరణకు రాష్ట్ర నలుమూలల నుంచి సాయి అభిమానులు, గాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొంటున్నారని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్, రాజేందర్‌సింగ్, లెనిన్, ఎస్‌పి రాజు, నాగభూషణంగౌడ్, డీజే శేఖర్, రవికుమార్‌యాదవ్, బంగారు శ్రీనివాసులు, లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మండ్ల రామకృష్ణ, రియాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

26న జాబ్ మేళా

ఆత్మకూర్: నిరుద్యోగులు అప్రెంటిషిప్ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డి, ఒకేషనల్ సీనియర్ అధ్యాపకుడు విశ్వేశ్వర్ కోరారు. ఇంటర్ విద్యాధికారి అంజయ్య ఆదేశాల మేరకు 2023, 24, 25 సంవత్సరంలో ఒకేషనల్ గ్రూప్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 2025–26 సంవత్సరాలకు గాను అప్రెంటిషిప్, జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎస్సెస్సీ, ఇంటర్ మెమో, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో పాటు బయోడేటాతో ఈ నెల 26న మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఒకేషనర్ జూనియర్ కాలేజీలో హాజరు కావాలని కోరారు.